ప్రభుత్వ పథకాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె

జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల యూనిట్-1 ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులు నాల్గవ రోజు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండామరిపల్లి గ్రామంలో స్త్రీ, శిశు అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. గ్రామస్తులకు పోషణ, ఆరోగ్యం, శిశు సంరక్షణ, మహిళా భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. గ్రామంలో శుభ్రత కార్యక్రమాలను కూడా చేపట్టి సామాజిక బాధ్యతను పాఠంగా చూపించారనితెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.దేవేంద్ర నాయక్, ఫిజికల్ డైరెక్టర్ శరత్‌కుమార్ నాయక్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఎఎన్ఎంలు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మైనర్లు వాహనాలు నడిపితే లైసెన్స్ రద్దు

- కలెక్టర్ నిశాంత్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమాని లైసెన్సు రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని, అనుమతి లేకుండా ప్రైవేట్ వాహనాలలో మార్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రహదారులపై భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి ధీరజ్ రహదారులపై భద్రతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సంవత్సరం రహదారులపై ప్రమాదాల వివరాలు, హిట్ అండ్ రన్ కేసులు, రహదారులపై భద్రత అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్లపై తీసుకున్న చర్యలు, తదితర అంశాలను వివరించారు. రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా సాయంత్రం 6 నుంచి 9 గంటల లోపు లేదా ఉదయం 6 గంటల లోపు జరుగుతున్నాయని, 80 శాతానికిపైగా ప్రమాదాలు జాతీయ రహదారులపైనే చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. గత ఏడాది నవంబరుతో పోలిస్తే ఈ ఏడాది నవంబర్‌లో ప్రమాదాలు తక్కువగా జరిగాయని పేర్కొన్నారు. జిల్లాలో పుల్లంపేట, ములకల చెరువు వద్ద రెండు పెద్ద ప్రమాదాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో జాతీయ రహదారులపై 26 బ్లాక్ స్పాట్లను గుర్తించామని వీటిపై చర్యలు తీసుకోవడానికి జాతీయ రహదారుల శాఖ పోలీస్ శాఖ, ఆర్టిఓ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. లారీ డ్రైవర్లు తగినంత విశ్రాంతి సమయం లేకుండా నడపడం వల్ల రోడ్డు ప్రమా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వారికి తగిన విశ్రాంతి సమయం ఇవ్వగలిగితే రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం రహదారులపై ప్రమాదాలను తగ్గించడానికి ఆర్అండ్‌బి, రవాణా శాఖ, ఎపిఎస్ ఆర్‌టిసి, తదితర శాఖలు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. లారీ డ్రైవర్లకు తగినంత విశ్రాంతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లారీ డ్రైవర్ల అసోసియేషన్‌కు సూచించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రుల లైసెన్సులు లేదా ఆ వాహన యజమానుల లైసెన్సు రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగించే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పెట్రోలింగ్ వెహికల్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలకు వెళుతున్న లారీ డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేలా రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలో రహదారులపై భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్టిఓకు సూచించారు. పోలీసు శాఖ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా బైకులు నడిపే వారికి జరుగుతున్నాయని, వాటిపై పర్యవేక్షణ పెంచి హెల్మెట్ లేని వారిపై చలానాలను విధించాలని మద్యం తాగి నడిపే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని 18 ఏళ్ళ నిండని మైనర్లు రహదారులపై వాహనాలను నడపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు రహదారి మధ్యలో నిలపకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఆర్అండ్‌బి శాఖ అధికారి సహదేవరెడ్డి, ఆర్‌టిఒ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేస్తున్న రెవెన్యూ అధికారులు

- సిఐటియు, వ్య.కా.స నాయకులు

బాధితుడితో మాట్లాడుతున్న సిఐటియు, వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి-గాలివీడు

నిరుపేద కుటుంబానికి రెవెన్యూ అధికారులు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ తెలిపారు. రెవెన్యూ అధికారుల ద్వారా అన్యాయానికి గురికాబడిన అనిమెల పార్వతమ్మ భూమిని, బాధితురాలి భర్త నాగరాజుతో కలిసి సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996వ సంవత్సరంలో పార్వతమ్మ గోరాన్ చెరువు గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 1963/3 లోని 10 సెంట్లు విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని, ఘోరాన్ చెరువు గ్రామం, కుమ్మరపల్లికు చెందిన కాల్వపల్లి శేఖర్‌రెడ్డి నుండి కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అనంతరం ఆ భూమికి సంబంధించిన హక్కులన్నీ పార్వతమ్మ పేరున బదలాయింపు కూడా జరిగిందని, నేటికీ పార్వతమ్మ పేరునే భూమి ఉందని తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్ కొమ్మద్ది వెంకటాద్రి, దాసరి చిన్నపరెడ్డి పార్వతమ్మకు చెందిన 10 సెంట్లు భూమిలో నుండి దౌర్జన్యంగా వారి పొలాల వద్దకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయమై పార్వతమ్మ దౌర్జన్యకారుల మీద చర్యలు కోరుతూ మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం లభించలేదని తెలిపారు. సుమారు 300 సార్లు ఫిర్యాదులు చేస్తే స్పందించి పరిష్కారం చేయవలసిన రెవెన్యూ అధికారులు, ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా పదే పదే ఫిర్యాదులు చేస్తున్నారనే కారణం చూపి పార్వతమ్మ ఆధార్ కార్డును రెవెన్యూ అధికారులు బ్లాక్ చేయడం అత్యంత దుర్మార్గకరమని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎన్నిదపాలైనా ఫిర్యాదు చేసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని, పదేపదే ఫిర్యాదులు చేస్తున్నారని ఆధార్ కార్డును బ్లాక్ చేసే అధికారం ఏ ఒక్క అధికారికి లేదని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకొని దౌర్జన్యకారులపై చర్యలు తీసుకొని, పార్వతమ్మ సమస్యను పరిష్కారం చేయడంతో పాటు ఆధార్ కార్డు పునరుద్ధరణకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

14 నుంచి ఇంధన పరిరక్షణ వారోత్సవాలు : సిఎండి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

ప్రజాశక్తి - కడప

ఎపిఎస్ పిడిసిఎల్ పరిధిలో ఇంధన పరిరక్షణ వారోత్సవాల నేపథ్యంలో ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం తిరుపతి బ్రాంచ్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 20 వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో ఈనెల 19, 20 తేదీల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు ఇంధన పరిరక్షణ - అవశ్యకత అంశంపై స్టాల్స్ ఏర్పాటు పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంధన పరిరక్షణ అంశంపై సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో విద్యార్థులకు వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని, ఈ పోటీల్లో పాల్గొని, గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 17న తిరుపతి నుంచి ఆన్లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని, విజేతలకు ఈనెల 20వ తేదీన బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పి డైరెక్టర్ కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, ఎం. ఉమాపతి, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ చంద్రశేఖరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయప్రకాష్, ఎన్‌జిఒ సంస్థ ప్రతినిధి మధుబాబు పాల్గొన్నారు.

'అన్నమయ్య'ను యథాతథంగా కొనసాగించాలి

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లా విభజనపై పునరాలోచించి యథాతథంగా కొనసాగించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని ఆయన గురువారం రాయచోటిలోని కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి అఅందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ఎన్నికల హామీ మేరకు ఒక పార్లమెంట్ నియోజక వర్గాన్ని ఒక జిల్లాగా చేసిందన్నారు. అన్నమయ్య జిల్లా 2022 ఏప్రిల్ 4న అధికారికంగా ఏర్పడిందన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వంజిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా, పాత చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల నుంచి ఈ కొత్త జిల్లాను ప్రకటించిందన్నారు. ఎక్కడైతే 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడానికి అవసరమైనటు వంటి పరిశీలన చర్యలు చేపట్టి ఏ ప్రాంతంలో మహనీయుల వ్యక్తులను గుర్తించి వారి పేర్లపై జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా అభివృద్ధిపై తాము ఏదైతే తాము కలలు కన్నామో ఆదిలోనే ఆటంకం కలగడం చాలా బాధగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు కొత్త జిల్లాల ఏర్పాటుకు గెజిట్ ఇచ్చారన్నారు. ఇందులో 60 శాతం భూభాగాన్ని ఇంకో జిల్లాకు ఇచ్చి కేవలం 40 శాతం భూభాగం ఉండేలా చేసి, రాష్ట్రంలోనే అతి చిన్న జిల్లాగా చేసి, జిల్లా కేంద్రాన్ని ఒక కార్నర్‌గా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాలు దశాబ్దాలుగా తీవ్రమైన కరువుతో బాధపడుతున్న ప్రాంతాలని, రాయచోటి జిల్లా కేంద్రంగా ప్రకటించబడిన తరువాత కొంత అభివృద్ధి జరుగు తోందన్నారు. అన్నమయ్య జిల్లాను విభజించకుండా యథాతథం గా కొనసాగించి, అభివృద్ధిలో ఏప్రాంతానికి తీసిపోని విధంగా ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన పభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైఎస్ఆర్ సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పట్టణ కన్వీనర్ నవాజ్ ,గాలివీడు మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి, కౌన్సిలర్లు షబ్బీర్, అన్నా సలీం, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, మాజీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుక్కా అంజనప్ప, సగినాల శివశంకర్, నాయకులు జూలూ, కనపర్తి చెన్నారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు పూలుకుంట జనార్దన్‌రెడ్డి, కొత్తపల్లె దేవేంద్రరెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చమర్తి, నాయకులు

అట్టహాసంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట

గీతాంజలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు అట్టహాసంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసే ఈ క్రికెట్ పోటీలు సంక్రాంతికి ఒక నెల ముందే ప్రారంభమై సంక్రాంతికి పూర్తవుతాయి. గీతాంజలి విద్యా సంస్థల అధినేత సంభావు వెంకట రమణ తనయుడు వినయ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసే ఈ క్రికెట్ టోర్నమెంట్ గత కొన్ని సంవత్సరాలుగా బాగా ప్రాచుర్యంలోకి రావడమే కాకుండా రాజంపేట నియోజవర్గం నుండే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నిక గన్న 50 బృందాలు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. దాదాపు నెల రోజులు జరిగే ఈ పోటీలలో పాల్గొనే అన్ని బృందాలకు అన్ని వసతులు కల్పించడమే కాకుండా మొదటి బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు సంక్రాంతికి ఒక రోజు ముందు జరిగే ఫైనల్ లో బహుకరిస్తారు. ఈ గీతాంజలి ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించిన జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ యువక్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రతి ఏటా ఈ విధంగా పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న రమణ అభినంద నీయుడని, వారి తనయుడు కూడా వారి బాటలోనే నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా సమాజానికి సేవలు అందిస్తున్నాడని కొనియాడారు. ఈ ప్రారంభోత్సవానికి అశేషంగా తరలి వచ్చిన కూటమి నాయకులను సంభావు రమణ ఘనంగా సన్మానించి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు నాయుడు, సంజీవ రావు, నాగేశ్వర్ నాయుడు, శామీర్‌బాష, గుల్జార్‌బాష, నరసింహ, చెంగల్ రాయుడు, సుబ్రమణ్యం, సతీష్ రాజు పాల్గొన్నారు.

రక్తహీనతకు ఐరన్ మాత్రలు తప్పనిసరి

ప్రజాశక్తి-పీలేరు

పిల్లల్లో రక్తహీనత సమస్య అధికమించడానికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు విధిగా తీసుకోవాలని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. గురువారం తలుపుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తగితే రక్తహీనత అంటామని, పిల్లల ఎదుగుదల ఆలస్యానికి ఇదో కారణం కావచ్చని, కావున విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగి, వారు చదువులో మెరుగైన శ్రద్ధ కనపర్చడానికి ప్రతి గురువారం పాఠశాలలో పంపిణీ చేసే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలతో పాటు నిత్యం ఐరన్ అధికంగా లభించే తాజా పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు ఆహారంగా స్వీకరించాలని, వ్యక్తిగత శుభ్రత విధిగా పాటించాలని డాక్టర్ శ్రీగిరీష విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, కృష్ణయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ల్యాబ్ ఓనర్స్ అసోసియేన్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ల్యాబ్ ఓనర్స్ అసోసియేషన్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా మహేష్, జనరల్ సెక్రెటరీగా రాజారెడ్డి, ట్రెజరర్‌గా జోషి, వైస్ ప్రెసిడెంట్‌గా షఫీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో రబీ సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, కృత్రిమంగా కొరతను సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీ 2025-26కు గాను, అన్ని పంటలకు అవసరమైన 18071 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గత ఏడాది అక్టోబర్ 1 నాటికి 4119 మెట్రిక్ టన్నుల యూరియా ప్రారంభ నిల్వలు అందు బాటులో ఉన్నాయని, ఈ నెల 31 వరకు జిల్లాకు 6124 మెట్రిక్ టన్నుల అవసరం కాగా, ఇప్పటికే 6250 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామని వివరించారు. ఈనెలాఖరికి ఇంకనూ 1546 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందన్నారు. జిల్లా లో ఇప్పటివరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని, దేశీయంగా ఉన్న అన్ని ఎరువుల కర్మాగారాలు ఉత్పత్తి చేస్తున్నాయని చెప్పారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం విదేశాల నుంచి కూడా యూరియా దిగుమతులు చేపడుతుందన్నారు. రాబోయే పంట కాలంలో యూరియాకు ఎటువంటి కొరత రాదని రైతులకు సూచించారు. నూతనంగా సాంకేతికంగా అభివృద్ధి పరచిన నానో యూరియా, నానో డిఎపి ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఇవి సాంప్రదాయ ఎరువులకు నూరు శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తున్నా యన్నారు. ఎరువులను కొనుగోలు చేయునప్పుడు బస్తా పై ముద్రించిన ఎంఆర్‌పి ధరలను చూసుకుని, దాని ప్రకారం పైకము చెల్లించి, తప్పని సరిగా డీలరు నుంచి రశీదు ఉండాలని రైతులకు సూచించారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా , ఎరువులను మళ్లింపు చేసిన, ఎంఆర్‌పి ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించినా వారి దుకాణాల లైసెన్స్ లు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం 1985, ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

యథావిధిగా విమానయాన సేవలు

- కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్

మాట్లాడుతున్న కడప ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఎప్పటిలాగే యథావిధిగా విమానయాన సేవలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించనున్నామని కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్‌కుమార్ పోద్దార్ తెలిపారు. ఇటీవల ఇండిగో విమాన సేవల సంక్షోభం అనంతరం భవిష్యత్తులో కడప విమానాశ్రయం అందించే మెరుగైన సేవల గురించి కడప మిమానాశ్రయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. 2025 డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించిన ఇండిగో సంక్షోభం తరువాత, ప్రస్తుతం కడప విమానాశ్రయం సాధారణంగా పనిచేస్తోందని అన్నారు. అన్ని విమానాలు నిర్ణీత సమయానికి నడుస్తున్నాయని తెలిపారు. సగటున రోజూ 200 మంది ప్రయాణికులు కడప విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈనెల 4న విమాన రాకపోకలలో 2 గంటలకు పైగా ఆలస్యం అయిందని 5వతేదీ మినహా కడప విమానాశ్రయంలో ఎటువంటి విమాన రద్దు జరగలేదని తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఇండిగో సంస్థ ముందుగానే సమాచారం అందించిందన్నారు. ప్రస్తుతం కడప విమానాశ్రయంలో ప్రయాణికులకు సంబంధించి డెలివరీ చేయాల్సిన బ్యాగేజీ ఏదీ పెండింగ్‌లో లేదని తెలిపారు. ప్రస్తుతం ఇండిగో హైదరాబాదుకు రోజూ, చెన్నై, విజయవాడకు రోజుమార్చి రోజు విమానాలు నడుపుతున్నామని చెప్పారు. హైదరాబాద్ నుంచి విమానం (రోజూ మధ్యాహ్నం 12:40 గంటలకు వచ్చి, అక్కడి నుండి చెన్నై, విజయవాడకు (రోజు మార్చి రోజు) వెళ్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వెళ్లే విమానం రోజూ సాయంత్రం 3:30 గంటలకు ఉంటుంది అని తెలిపారు. హైదరాబాద్, చెన్నై విమానాలు ప్రయాణికులకు గల్ఫ్ దేశాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే కనెక్టింగ్ విమానాలను అందుకోవడానికి సహాయపడతాయని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం స్నాక్స్ బార్, కార్ రెంటల్ సర్వీసెస్ వంటి కొత్త సదుపాయాలు విమానాశ్రయంలో ప్రవేశపెట్టబడ్డాయన్నారు. త్వరలో ఇవి ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం కానుందని ఆయన చెప్పారు. ప్రయాణికుల సహాయార్థం 'మేఐ హెల్ప్ యు' డెస్క్, కొత్త బేబీ కేర్ (శిశు సంరక్షణ) సేవ, కొత్త స్నాక్ బార్ సౌకర్యం త్వరలో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. హైదరాబాద్ నుంచి కడపకు మరో రోజువారీ విమానం, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరులకు రోజువారీ విమానాలు నడపడం వంటి కొత్త మార్గాలను జోడించాలని ఎఎఐ ఇండిగో, ఇతర విమానయాన సంస్థలను కోరిందని చెప్పారు. కడప విమానాశ్రయంలో 2023 నుంచి నైట్ ల్యాండింగ్ సౌకర్యం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ తోపాటు ఆపరేషన్స్ మేనేజర్ దామోదర్ రెడ్డి, ఎస్‌పి ఎఎఫ్ కె.ఆర్ముగం పాల్గొన్నారు.

'రీ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి'

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని టిడిపి నేతలు కొండారెడ్డి గండికోట సుధాకర్, ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం చెన్నముక్కపల్లి గ్రామంలో జరిగిన ఈ సర్వే కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహకుమార్, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌లతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఆదుకునేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించి విజయవంతమైందని పేర్కొన్నారు. అదే రీతిలో ప్రస్తుతం భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. సమస్యలు ఉన్నవారు అధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు.

కోర్టు మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం తగదు

- కోర్టు ఎదుట నిరసనలో న్యాయవాదులు

ప్రజాశక్తి - రాయచోటి

సివిల్ కేసులో జోక్యం చేసుకోవద్దని హిందూపురం న్యాయవాది అబ్దుల్ రహీం సిఐని అడిగినందుకు దుర్భాషలాడి స్టేషన్ నుంచి గెంటేయడం దారుణమని, వెంటనే సిఐపై చర్యలు తీసుకోవాలని, రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు పేర్కొన్నారు. గురువారం కోర్టు విధులను బహిష్కరించి మెయిన్ గేట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డిబాష, ఉపాధ్యక్షులు ధనంజయ్ కుమార్, ఐఎఎల్ నాయకులు ఆనంద్ కుమార్, టి.ఈశ్వర్ ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధన, అడిషనల్ జూనియర్ తేజస్వినిని కలిసి ఫిర్యాదు చేశారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం ఎక్కువైందని కోర్టు వారు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ చెల్లదని పోలీసులు వ్యంగంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను విస్మరించడం అంటే రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనని తెలిపారు. ఈ సంస్కృతి బాధితుల హక్కులకు భంగకరమవుతుందని, ఆర్థిక బలం అంగ బలం ఎవరికి ఉంటే పోలీసులు వారికి వత్తాసు పలుకుతూ న్యాయమూర్తులు ఇచ్చే ఆదేశాలను తుంగలోతొక్కుతున్నారని వాపోయారు. ఇది న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి భంగకరమని, బాధితులు హక్కులకు అభ్యంతరకరమని, ఇలాంటి పరిస్థితులను పోలీసుల ప్రవర్తనను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని న్యాయవాదులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో న్యాయ వాదులు కందుకూరి ఈశ్వరయ్య, చిన్నయ్య, టి.వి. రమణ, రామాంజనేయులు, హోమయోన్‌బాషా, నాగముని, ఇలియాస్‌బాష, వరలక్ష్మి, మాధవి, శివకుమార్, నాగేంద్ర, అంజి పాల్గొన్నారు.

గ్రామ సభలతోనే సమగ్రాభివృద్ధి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

గ్రామ సభలతోనే గ్రామ పంచాయతీలలో సమగ్రాభివృద్ధి సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం వరదయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఆయన సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 80 శాతం భూ సమస్యలే ఉన్నాయన్నారు. వైసిపి హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని గ్రామ పంచాయతీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం అభివృద్ధికి పాటు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

భూ సమస్యలకు సత్వర పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-రామాపురం

భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తహశీల్దార్లను ఆదేశించారు. గురువారం జిల్లాలోని పది మండలాలకు సంబంధించిన తహశీల్దార్లతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రజా సమస్యలు మిగులు భూములు జీరో ఖాతా, డికెటి భూములు, మృతి చెందిన వారి వారి సత్వమును పట్టాలు మార్చడం లాంటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. వెబ్ ల్యాండ్ కరప్షన్ పై ల్నేస ఆయన తనిఖీ చేశారు. ఈ సమావేశంలో పది మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో గురువారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వైసిపికి చెందిన పలువురు కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని సుద్దమల్ల పంచాయతీ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సొంత గ్రామనికి చెందిన ఎస్‌విఎంఎస్ గ్రూప్ అధినేత వీరబల్లి నాగసునీల్ కుమార్‌రెడ్డి మరో 13 మందితో టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నాగ సునీల్‌కుమార్ రెడ్డితో పాటు లోకేష్, ఆశోక్, అబీ భాష, పీట మధు, పేట శ్రీకాంత్, హరిరెడ్డి, అమీజాషా, షేక్ జలాని, శ్రీకోల్లి, పీట మధు, పేట శ్రీకాంత్, షేక్ అన్వర్, కరిముల్లా, పెదరాయుడు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని సునీల్ కుమార్‌రెడ్డి అన్నారు రాష్ట్రంలో పార్టీ ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని 2029లో కూడా ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకుడు అంజనారెడ్డి, పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రిన్సిపల్ ప్రభాకర్

క్రీడల్లో సత్తాచాటిన 'నారాయణ' విద్యార్థులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉమ్మడి చిత్తూరు జిల్లా నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో చంద్రగిరి సమీపంలోని ఎస్ఎంపిఎస్ బాయ్స్ క్యాంపస్‌లో జరిగిన నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీల్లో స్థానిక నారాయణ హైస్కూల్ విద్యార్థుల అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 25 పాఠశాలలు విద్యార్థులు పాల్గొనగా అందులో పలు విభాగల్లో మొదటి, ద్వితీయ స్థానాలలో విజేతలుగా తమ పాఠశాల విద్యార్థులు నిలవడం గర్వకారణమని ప్రిన్సిపల్ ప్రభాకర్ ప్రశంసించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు విశిష్ట అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజిఎం కొండలరావు, ఎజిఎంలు, ఆర్ఐలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బి.కొత్తకోట



కీర్తన జ్యోతిక ప్రకాష్

ఎస్‌వి యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన డిగ్రీ నాలుగవ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు యూని వర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ తెలిపారు. బికాం కంప్యూటర్స్‌లో ఎం.జ్యోతిక 93.4శాతం, సి.ప్రకా ష్ 91.8, పి.చంద్రవర్ధన్ 91, బి.మనోజ్ 90.6, పి.ప్రతిభ 90శాతం ఉత్తీర్ణత సాధించారు. బిఎస్‌సి కంప్యూటర్ సైన్సులో ఎస్.కీర్తన 92శాతం, జి.స్నేహాంజలి 91.6,కే.తనుషా 90.5, పి.ఉజ్మ సుల్తానా 90.3 మార్కులతో సత్తాచాటారని తెలిపారు. బిసిఎ కంప్యూటర్ అప్లికేషన్సులో డి.పవిత్ర 91.7, కె.ఆసిఫా 90.1శాతం సాధించినట్లు తెలిపారు. ఇందులో 11 మంది విద్యార్థులకు 90 శాతంపైన 68 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. కామర్స్ సబ్జెక్టులో ఒక్కరు, మ్యాథ మా టిక్స్‌లో ఐదుగురు 100/100మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూని వర్సిటీ స్థాయిలో అత్యుత్తమ విద్యార్థులను ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బి.రాజేంద్రనాయక్, అధ్యాపకులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

21న సుదర్శనశర్మకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : ఈనెల 21న న్యూఢిల్లీలోని సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు తనకు డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ ధర్మకర్త బండాత్మకూరు సుదర్శన శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రంగాలలో సామాజిక సేవలు చేసినందుకు గాను తనకు ఈ డాక్టరేట్ ప్రధానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-పీలేరు: మండల పరిధిలోని దొడ్డిపల్లి గ్రామం, కొత్తపేటకు చెందిన హోంగార్డు ఎంపి.వేణుగోపాల్ అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. ఆయన పీలేరు, మొలకలచెరువు చెక్ పోస్ట్, కెవిపల్లిలో విధులు నిర్వహించారని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం గుండె నొప్పితో బాధపడుతుండగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. మృతుడికి భార్య, హేమశ్రీ, ఇంటర్మీడియట్ చదువుతున్న కుమార్తె ఉన్నారు. వేణుగోపాల్ మృతి చెందాడని తెలియడంతో తనతో పని చేసిన, చేస్తూన్న పోలీసులు, హోంగార్డులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

వేణుగోపాల్(ఫైల్ ఫొటో)

చట్టాలపై అవగాహన అవసరం : సిఐ

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లె సిఐ టివి.కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తూముకుంట గ్రామంలోని సచివాలయంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, మహిళలపై జరుగుతున్నటువంటి దాడులు, సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాల గురించి వివరించారు. మత్తు పదార్థాలు వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. మహిళలు శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాదం ఉన్న సమయంలో శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎవ్వరూ బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని చెప్పారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. చిన్న వయసులో వివాహం చేయడంవల్ల వారు మానసికంగా, శారీ రకంగా ఇబ్బందులు గురవుతారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారు ప్రయోజకులు అయిన తర్వాతే వివాహం చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు వినియోగం వల్లే జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. అనారోగ్యం బారిన పడి చిన్నవయసులో తనవు చాలించే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాల్లు ఆశ చూపి బురిడి కొట్టిస్తారని చెప్పారు. ఒటిపి నంబర్లను ఎవ్వరికి షేర్ చేయవద్దని చెప్పారు. బ్యాంకు వివరాలు, ఎటిఎం కార్డులు వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే మెజేస్‌ల క్షుణంగా పరిశీలించాలని చెప్పారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రామకృష్ణ, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ కొండారెడ్డి

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ భానుప్రసాద్

ప్రజాశక్తి- కలకడ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కదిరాయ చెరువు సచివాలయాన్ని ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరును, రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో జరుగుతున్న కౌశలం పరీక్షలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలని తెలిపారు. వివిధ కార్యకలాపాలకు సచివాలయాలకు వచ్చే ప్రజలతో మమేకమై మర్యాద పూర్వకంగా పలకరించి వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లి ఎంపిపిగా శ్యామలమ్మ ఏకగ్రీవం

ప్రజాశక్తి తంబళ్లపల్లి

తంబళ్లపల్లి ఎంపిపిగా చిటికి శ్యామలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి డిఎల్‌డిఒ అమర్నాథ్‌రెడ్డి, ఎంపిడిఒ బాబూ పట్నాయక్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. వైసిపి ఎంపిటిసి సభ్యులు 11 మందికి గాను 10 మంది హాజరైనారు. కోసువారిపల్లి ఎంపిటిసి చిటికి శ్యామలమ్మ పేరు ఎంపిపి అభ్యర్థిగా ఎద్దులవారిపల్లి ఎంపిటిసి హరిత ప్రతిపాదించిగా కన్నెమడుగు ఎం పిటిసి రెడ్డిమహేష్ బలపరిచి నామినేషన్ సమర్పించారు. ఒకే నామినేషన్ కావడంతో శ్యామలమ్మ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికలధికారి ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందించారు. ప్రమాణస్వీకారం చేయించారు.ఎక్కడ ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎంపిపిగా ప్రమాణం చేస్తున్న శ్యామలమ్మ

వేగవంతంగా భూ రీసర్వే

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ హరికుమార్

ప్రజాశక్తి-కలికిరి

భూ రీసర్వేని వేగవంతం చేయాలని తహశీల్దార్ హరికుమార్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన మర్రికుంటపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ ర్వేలో ముందు జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రీ సర్వే జరుగుతున్న భూముల రికార్డులను పరిశీలించారు. తరువాత అద్దవారిపల్లి, మహల్, మేడుకుర్తి గ్రామాల నుండి పిజిఆర్ఎస్‌లో భాగంగా వచ్చిన భూ సమస్యలను ఆయన ఆయా గ్రామాల సచివాలయాలకు వెళ్లి పరిశీలించారు. త్వరితిగతిన వాటికి పరిష్కార మార్గం చూపాలని రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రి సర్వే డిటి వెంకటరమణారెడ్డి మరికుంటపల్లి విఆర్ఒ సురేష్‌రెడ్డి, అద్దివారిపల్లి విఆర్ఒ నౌషాద్, మహల్ విఆర్ఒ ఆది లక్ష్మమ్మ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి - మదనపల్లె టౌన్

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా అంకిశెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వాలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మొక్కలను నాటి, వాటికి నీరు పోసి పరిరక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం పెరుగుతున్న ఈ రోజుల్లో పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిక్షించాలని కోరారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఓజోన్ పొర దెబ్బతినడం వల్లనే అకాల వర్షాలు, క్లౌడ్‌బస్టర్‌లు, వాతావరణ లోపాలు సంభవిస్తున్నాయని, వాటిని నివారించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడమే మార్గమని తెలిపారు. నేటి చిన్న మొక్కలే రేపటి మహా వృక్షాలు అవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక శిబిరం ఆరోరోజు సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా, ఈ-టీచింగ్ వంటి అంశాలపై శక్తి టీం సభ్యులు అవగా హన కల్పించారు. అనంతరం వాలంటీర్లచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ అధ్యాపకులు బాలరాజు, శక్తి టీం సభ్యులు ముని నాయక్, అంకిశెట్టిపల్లి పంచాయతీ ఇన్‌చార్జ్ జంగాలపల్లి రమణ, పంచాయతీ కార్యదర్శి రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

'మిట్స్'లో పారిశ్రామిక ప్రగతిపై అవగాహన

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బియూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజెస్ ఫర్ యంగ్ మైండ్స్' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి పారిశ్రామిక వేత్తగా ఎదగడం కోసం అవసరమైన నైపుణ్యాలు, స్వతంత్ర ఆలోచన, మార్కెట్ అవగాహన, రిస్క్ తీసుకునే ధైర్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. టెక్నాలజీ పురోగతి, డిజిటల్ సేవలు, ఇ-కామర్స్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధస్సు , ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి రంగాల్లో దేశంలో కొత్త వ్యాపారాలకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, యువ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుండి అనేక ప్రోత్సాహకాలు లభిస్తున్నాయని తెలిపారు. మంచి ఆలోచనలను వ్యాపారంగా మార్చే దిశగా మార్కెట్ అధ్యయనం, వనరుల సమీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి విషయాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలన్నారు. దేశ అభివృద్ధికి పరిశ్రమలు కీలకమని, పారిశ్రామిక వేత్తలుగా యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, ప్రొఫెసర్ అండ్ డీన్ డాక్టర్ భాను శ్రీరెడ్డి, కో-ఆర్డినేటర్ కె.ఎలియ్య, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

24 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-రామపురం

మండలంలో 24 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి పేర్కొన్నారు. మండలంలోని కల్వన చెరువు పంచాయతీ రైతు సేవ కేంద్రంలో గురువారం మూలపల్లికి చెందిన ఏడుగురు రైతుల నుంచి 24ఎంటిఎస్ ధాన్యాన్ని జిల్లా పౌర సరఫరాల సంస్థ కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు. వరి పంటను ఇ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతులకు మేలు చేకూరేలా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు ఇది మంచి అవకాశమని ఏర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, పౌరసరఫరాల శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎఒ నాగమణి

హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హాజరు పుస్తకాన్ని పరిశీలించి అధికారులు విధులకు సకాలంలో హాజరు కావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గుర్తించారు. పని వేళల్లో పలువురు సిబ్బంది కార్యాలయంలో లేకుండా బయట తిరగడం ప్రజలకు సేవల్లో అంతరాయం కలిగిస్తున్నదని ఆక్షేపించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ప్రతి అధికారి తప్పనిసరిగా కార్యాల యం లోనే అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సి పల్ సేవలను సమయపాలనతో అందించాల్సిన అవసరాన్ని అధికారులు గమనించాలని సూచించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : మండలం లోని రాఘవరాజుపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడి యట్ సిఇసి ద్వితీయ సంవత్సరం చదువుచున్న గిద్దలూరు జాహ్నవి అనే పేద విద్యార్థినికి కోడూరు మానవతా సభ్యులు కె ప్రసాద్‌వర్మ రూ.5 వేల నగదు అందించారు. కార్యక్రమంలో సభ్యులు సి.నాగేంద్ర, డైరెక్టర్ శ్రీనివాసులు శ్రీనువాసులరెడ్డి పాల్గొన్నారు.

ఎంసి చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-పీలేరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ గురువారం పీలేరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి పార్టీ నాయకులు అండ్ డాక్టర్ హరిప్రసాద్ తోపాటు జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్, ఎంసి చైర్మన్ పురం రామమూర్తిలను ఘనంగా సన్మానించి, సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివృద్ధి, కూటమి పార్టీ బలోపేతం అంశాలపై మార్కెట్ కమిటీ చైర్మన్‌తో చర్చించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోల కిషోర్ నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట :మండల కేంద్రంలోని పుల్లంపేటలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని శివాలయం వీధి, భావన ఋషిగుడి, బెస్తవీధి, దర్గావీధి లో పంచాయతీ కార్మికులచే చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. అనంతరం దోమలను అరికట్టేందుకు సున్నం, బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ మొత్తం శీతాకాలం కాబట్టి ప్రజలకి ఎటువంటి అనారోగ్యాలు బారిన పడకుండా పారిశుధ్య చర్యలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీలో ఎటువంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి

క్రైం కార్నర్

బొలెరో ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లి

ములకలచెరువు మండలానికి చెందిన ఓ రైతును బొలెరో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు చేతులు విరిగి రైతు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెద్దపాల్యకు చెందిన రైతు శ్రీరాములు స్కూటీలు పొలం వద్దకు వెళ్లేందుకు బయలుదేరాడని తెలిపారు. అదే సమయంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం స్కూటీని ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో రైతుకు కాళ్లు చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు బాధితుడిని 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ప్రథమ సికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయాకి వెళ్లాలని రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐనరసింహుడు తెలిపారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు

- 6 కిలోల గంజాయి స్వాధీనం : ఎఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలకోట మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని ముదివేడు పోలీసులు అరెస్టు చేశారు. గురువారం మదనపల్లి డిఎస్‌పి కార్యాలయంలో ఎఎస్‌పి వెంకటాద్రి, ములకలచెరువు సిఐ వెంకటేశ్వర్లు, ముదివేడు ఎస్ఐ మధు రామచంద్రుడు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ కురబలకోట మండలం, అంగళ్లు కేంద్రంగా గంజాయి జోరుగా సాగుతున్న నేపథ్యంలో నిఘా పెట్టామన్నారు. విశాఖపట్నం అరకకు చెందిన కిషోర్ మదనపల్లెకు చెందిన కరముల ఆవేష్‌కు గంజాయి విక్రయించేవాడన్నారు. ఆవేష్ స్థానికంగా ఉన్న కూరగాయల సురేష్‌బాబు, చల్ల తేజకుమార్, కోటకొండ చిట్టిసాయి, సాకే చంద్రశేఖర్, బొమ్మిశెట్టి భార్గవ్‌కుమార్, కూని వెంకటరమణ, భాను చంద్రారెడ్డికి విక్రయించేవాడని తెలిపారు. కిషోర్ నుంచి ఆవేశ్ కిలో రూ. 5వేల చొప్పున విక్రయిస్తే ఆవేష్ స్థానికంగా ఉన్న గంజాయి విక్రయదారులకు రూ.10వేలకు విక్రయించేవాడని చెప్పారు. ఆ పదివేలతో కొనుక్కున్న గంజాయి ముఠా కిలోను రూ.15వేల నుంచి రూ.20వేల వరకు అమ్మి సొమ్ము చేసుకునే వారన్నారు. పలువురు గంజాయి మత్తుకు బానిసలై కుటుంబాల్లో ఎన్నో అనర్థాలకు కారణం అవుతున్నారని తెలిపారు. గంజాయి ముఠాపై నిఘా ఉంచి కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ సర్కార్ తోపు వద్ద ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో భానుచంద్రారెడ్డి పరారీలో ఉన్నాడని అరకుకు చెందిన కిషోర్ పై కూడా నిఘా ఉంచినట్లు తెలిపారు. త్వరలో ఇద్దరిని అరెస్టు చేస్తామని ఎఎస్‌పి వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 6 కిలోల గంజాయి, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని తెలిపారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి వెంకటాద్రి